


# భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక






సంపుటి: 3 సంచిక: 292 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శనివారం, 15 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 292 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SATURDAY, 15 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI





## రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి
- జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ ఆగస్టు 14:** భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందే శంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వా తంత్ర్య దినోత్సవ వేడుకలతో మిగతా2లో...

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యత

- వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ
- నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్యతా ప్రాజెక్టులు పూర్తి
- డేటా సెంటర్లకు నీటి సరఫరాపై దుష్ప్రచారం
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 14:** రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం మిగతా2లో...




## నేరాల స్వరూపం మారుతోంది

సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్

రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన

డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి



## స్వాతంత్ర దినోత్సవానికి ఎర్రకోట ముస్తాబు

**న్యూ ఢిల్లీ, ఆగష్టు 14:** దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట నుంచి ఈ వేడుకలకు నేతృత్వం వహించను న్నారు. భారత వైమానిక దళానికి చెందిన రెండు ఎంఐ-17 హెలి కాప్టర్లతో సభా ప్రాంగణంపై పూలవర్షం కురిపిస్తారు. 21 గన్ సెల్యూట్ తో ఏకకాలంలో జాతీయ జెండాను ఎగురవేస్తారు. పూల జల్లు అనం తరం, ప్రధానమంత్రి ఎర్రకోట ప్రాంగణం నుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. జాతీయ గేయం వందేమాతరం 150 ఏళ్ల వారసత్వాన్ని పురస్కరించుకుని, 2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్ దిశగా నడిపించడంలో యువశక్తి ఆకాంక్షలు, కీలకమైన సహకారాన్ని వేడుకగా జరుపుకోవడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఎర్రకోటలో జరిగే ఈ వేడుకల్లో మొదటిసారిగా వందేమాతరం గీతాన్ని ఆలపిం చనున్నారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపిస్తారు. అనంతరం జాతీయ గేయం కూడా ఆలపిస్తారు. ఈ వేడుకల్లో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు చెందిన మొత్తం 2,500 మంది బాలురు, బాలికల వాలంటీర్లు పాల్గొంటారు.



## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ: భారత్‌లో బంగారం ధరలు నేడు మరోసారి తగ్గాయి. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడంతో నేడు భారత్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.710 మేర తగ్గింది.

గురువారం కూడా పసిడి ధర రూ.1,260 మేర తగ్గిన విషయం తెలిసిందే. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 14) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,52,890గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.650ల మేర తగ్గి రూ.1,40,150కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,670 వద్ద కొనసాగుతోంది.

## నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు

క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం

స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు

ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు

రూ. 2,100 కోట్ల అంచనా

తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం






తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు.


## సీఎం స్థాయి వ్యక్తి క్షుద్ర పూజలనడం బాధాకరం



హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాము దేవుళ్లకు పూజలు చేస్తే.. క్షుద్రపూజలు చేశారని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం బాధాకరమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ 'పేదల భూములను 22ఏ జాబితాలో చేర్చి ఆంక్షలు పెట్టి.. ఇప్పుడు వారి భూమి వారికే ఇప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదం. పేదల భూములు, ఇళ్లను సంబంధిత జాబితాలో పెట్టే అధికారం మీకు ఎవరిచ్చారు? 22ఏని అడ్డం పెట్టుకుని 30% నుంచి 40% పర్సంటేజీ దందా ఎవరు చేస్తున్నారో అందరికి తెలుసు. త్వరలోనే వారి వివరాలు బయటికొస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలపై ఏమాత్రం ప్రేమ ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలి. మా పాలనలో ఉచితంగాఇళ్లు నిర్మించి ఇచ్చినా ఎక్కడా పేర్లు పెట్టుకోలేదు. ప్రస్తుతం లబ్ధిదారుల వద్ద రూ.6 లక్షలు తీసుకునే మీరు.. ఇందిరమ్మ ఇళ్లు అని పేరు పెట్టుకున్నారు. దరఖాస్తుతోపాటు అడ్వాన్స్‌గా రూ.10వేలు చెల్లించాలనడం ఎంతవరకు సబబు.ఎంత విస్తీర్ణంలో ఇళ్లు నిర్మిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలి' అని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌ను నిర్మించి 20 ఏళ్లు అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.







# పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాల న్నారు. డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని.. మొత్తంగా వాటికి 3.5 టీఎంసీల నీరే సరిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్ లో ఆరు తడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగేలా జల ధార– జల హారతి పనుల్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కృష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ, సీఈలు హాజరయ్యారు.

# పెండింగ్ ప్రశ్నలకు సత్వరమే సమాధానాలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి సకాలంలో, స్పష్టంగా, సమగ్రంగా సమాధానాలు అందేలా పటిష్టమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాధానం ఇవ్వడానికి వీలుకాని ప్రశ్నలు ఏవైనా ఉంటే, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ సంక్షిప్త సమాధానం అందించాలని సూచించారు. అదేవిధంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలను సమీక్షించి, వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చోట చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించి పెండింగ్ జాబితా నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీస్ ఉన్నతాధికారులతో శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ, శాసన మండలి, శాసన సభ సమావేశాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అదనపు డీజీపీ మధుసూదన రెడ్డిని ఆదేశించారు.ఈ సమావేశాల్లో ఈసారి డిజిటల్ పాస్‌ల విధానాన్ని అమలు చేస్తున్నందున, పాస్‌లను తప్పనిసరిగా స్కాన్ చేసి, వాటి ధ్రువీకరణ అనంతరం మాత్రమే సంబంధిత వ్యక్తులను సభ ప్రాంగణాల్లోకి అనుమతించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. డిజిటల్ పాస్‌ల వినియోగం, స్కానింగ్, ధ్రువీకరణ ప్రక్రియపై భద్రతా సిబ్బందికి ముందుగానే పూర్తి అవగాహన కల్పించాలని, అనుమతించబడిన వ్యక్తులకే నిబంధనల ప్రకారం ప్రవేశం కల్పించేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. మన సభ ... జన సభ' కార్యక్రమం కింద శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల్లోకి సందర్శకులను అనుమతించే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో కూడా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పీకర్ సూచించారు. సందర్శకుల ప్రవేశం, డిజిటల్ పాస్‌ల పరిశీలన, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భద్రతా తనిఖీలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ భద్రతను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. సభా సమావేశాలు జరిగే సమయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా, అదే సమయంలో భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి రాజీ లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశాల్లో శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, గుంటూరు ఎస్.పీ. వకుల్ జిందాల్, సీఎం సెక్యూరిటీ ఎస్.పీ. భద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ (ఏబీబబితిఇ। ఃూబీసాజీ ఐజీనిబి)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఃూఆఃం) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. 'ఇదంతా పూర్తిగా అనవసరమైన పక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లకెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# పారిశ్రామిక వేత్తలుగా డ్వాక్రా మహిళలు

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి, ఆగస్టు 14:** డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలు రూ.3లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను స్త్రీనిధి రుణం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. ఈ పథకంలో మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను డిస్ట్రిక్ట్ రిసోర్స్ ఆర్గనైజేషన్స్‌గా పరిగణించి వారి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు. మహిళలకు కేవలం రుణం ఇవ్వడమే కాకుండా.. వారి వ్యాపారం విజయవంతం అయ్యే వరకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందన్నారు.

# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

**• పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు**



**హైదరాబాద్, ఆగస్టు 14:** తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యారావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి.ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభలో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# ఏపీలో ప్రతి రోజూ 7000 టన్నుల చెత్త

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను వేసిందని మండిపడ్డారు. చెత్త పన్ను వేసినా లక్షల టన్నుల చెత్త వదిలేసి వెళ్లిపోయిందన్నారు. మున్సిపాలిటీల్లో మిగిలిన మొత్తం 70 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2014-19 లో 10 వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని.. గత ముఖ్యమంత్రికి అవగాహన లేక వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లను రద్దు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురంలో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. పెద్దాపురంలో వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్ పూర్తి కాగానే రాజమహేంద్రవరంలో వచ్చే చెత్తను అక్కడికి తరలిస్తామన్నారు. ఈలోగా వ్యర్థాల నిర్వహణ కోసం 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ఎలాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ఎలాంట్‌లు పూర్తి చేసి ఘన వ్యర్థాల నిర్వహణ చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సీఎం చెప్పారని, విలీన గ్రామాల అంశంపై కోర్టు తీర్పు రాగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు.జస్టిస్ చక్రవర్తి తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువ రించారని న్యాయ వ్యవస్థకు విశేష సేవలందించారని అభినందించారు.ఐటీ రంగంలో ప్రభజంనం సృష్టించిన సత్యం కంప్యూటర్స్ కుంబకోణం కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పును ఇచ్చారన్నారు. ప్రధాన నిందితుడితో పాటు 10 మందికి 7 సంవత్సరాల శిక్షను విధించి కీలకమైన తుది తీర్పును వెలువరించారని వివరించారు.జస్టిస్ చక్రవర్తి సివిల్, క్రిమినల్ మరియు పబ్లిక్ సర్వెంట్ మిస్‌కండక్ట్ వంటి అనేక కేసులను విచారించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు.

# పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి,కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా, 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు.

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

**- సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత**

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను కూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది.

ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్టు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలాలో పర్యటిస్తుండగా రాహుల్ గాంధీ.. సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు.

అయితే, రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే లాయర్.. రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు.స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనికి యూపీ ప్రభుత్వం బదులిస్తూ ఒక అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసులో రాహుల్ గాంధీపై 153 ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదైందని, దీనిపై విచారణ జరిపేందుకు అవసరమైన అనుమతుల్ని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకోలేదని సుప్రీంకోర్టు గుర్తించింది. యూపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఈ వివరణ ఉంది. దీంతో రాహుల్ గాంధీపై నమోదైన పిటిషన్‌పై విచారణకు అర్హత లేదని భావిస్తూ.. సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసింది. ఇదే సమయంలో.. స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన అంశాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని రాహుల్‌కు సూచించింది.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
శనివారం, 15 ఆగష్టు 2026

# మొండిగేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం

## కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్






**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలోని తూర్పు నియోజకవర్గంలో దశాబ్దాల సమస్యగా పేరుకు పోయి ఉన్న మొండిగేట్ డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో సమీకరించిన రూ. 6.23 కోట్ల రైల్వే శాఖ నిధులతో ఆధునికీకరించబోతున్న పనులకు స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి శుక్రవారం శంకు స్థాపనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుంటూరు నగరం నుంచి విడుదలవుతున్న డ్రైనేజ్ నీరు మూడు ప్రాంతాల నుంచి పీకల వాగు, మొండిగేట్ ప్రాంతాల నుంచి మురుగునీరు బయటకు సరఫరా అవుతుందన్నారు. ఈ గేటు ద్వారా సగటున 30 వేల లీటర్ల డ్రైనేజీ వాటర్ బయటకు వెళ్తుంది. కానీ వర్షాలు అధికంగా పడిన సమయంలో వర్షపు నీరు, మురుగునీరు కలిసి పొంగి ఇళ్లల్లోకి కూడా వెళ్తున్నాయి. స్థానిక ప్రజల సమస్యలను నేను, నసిర్ దగ్గరుండి చూశాము. ఈ సమస్యను పరిష్కరిస్తూ ప్రస్తుతమున్న 30వేల లీటర్ల మురుగు పారుదలను 50 వేల లీటర్ల పారుదలకు అనుగుణంగా ఆధునికరిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని గుర్తించాము. అవుట్‌పుట్ పెంచితేనే స్థానిక సమస్య ప్రజల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రతిపాదించాము. ఆ ప్రతిపాదనలకు గాను సుమారు రూ. 7-8 కోట్ల అంచనాలు అవుతాయని భావించాము. ఈ నిధులను సమకూర్చేందుకు అధికారులతో సంప్రదించి, రైల్వే వారి నుంచి విడుదల చేసేందుకు సన్నహాలు చేశాము. రైల్వేశాఖ నుంచి కూడా సుముఖత వ్యక్తం కావడంతో నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నాము. 40-50 సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం ఏర్పడితే చుట్టుపక్కల డ్రైనేజీ ముంపుకు గురై సమస్యలు ఎదుర్కొంటున్న పంటపొలాల యజమానులకు కూడా పరిష్కారం దొరికినట్టే. రాజీవ్ గృహకల్ప, గొట్టాల రోడ్డు, వెంకటరామా థియేటర్, జియాద్దీన్ నగర్ ఈ నాలుగు ప్రాంతాల్లో, ఒక్కో ప్రాంతము వద్ద రూ. 2 కోట్ల తో పనులను చేయిస్తున్నామని తెలియజేశారు.

**ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ** పాత గుంటూరు ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఈ మొండిగేట్ ఇబ్బందిని పరిష్కరిస్తున్నాము. గుంటూరు నగరం నుంచి ఉత్పత్తి అవుతున్నటువంటి ఈ మురుగునీరు మొత్తం మొండిగేట్ వద్దకు వచ్చి పారుదల సజావుగా ముందుకు సాగక, పొంగి బయటకు పొర్లుతోందన్న విషయం అందరికి తెలిసిందే. స్థానిక అధికారులతో చర్చించగా సమస్యకు కోట్లాది రూపాయల వ్యయంతో ముడిపడి ఉందని అర్థమైన తర్వాత సమస్యను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ పాత గుంటూరు ప్రాంతంలో నివసించే 50 వేల కుటుంబాలకు పైగా పరిష్కారంగా మొండిగేట్ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టాము. సబ్ స్టేషన్ ఏర్పాటు, నంది వెలుగు ఆర్ఓబి ఇప్పుడు మొండిగేట్ ఆధునికీకరణ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చాము. గత వైసిపి పాలనలో తట్ట మట్టి కూడా ఎత్తని పరిస్థితి నుంచి నేడు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా అడుగులు ముందుకు వేస్తోంది. కేంద్ర మంత్రి పెమ్మసాని సహకారంతో రూ. 48 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నాము. ప్రతీ ఒక్కరి సమస్యలు మా సమస్యగా నేను పెమ్మసానితో కలిసి పనిచేస్తున్నామని తెలియజేశారు. రైల్వే అదనపు డిఆర్ఎం రమేష్ మాట్లాడుతూ,రైల్వే 1.2 నుంచి 1.3 మీటర్ల పొడవునా ఆధునికీకరించి అదనంగా మరో 25 క్యూసెక్కులకు పైగా డ్రైనేజీ నీటిని విడుదల చేసే విధంగా నిర్మిస్తున్నాము. నిర్మాణానికి సంబంధించి నిధులు ఈ సంవత్సరమే మంజూరయ్యాయి. వర్షాకాలం పూర్తయిన తర్వాత మిగిలిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాము. అనవసరమైన వ్యర్థాలు ఈ డ్రైనేజీలో కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, మాజీ కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, మీరావలి, చిష్టి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


# రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం 25వ డివిజన్ కొత్త కాలనీ మరియు 24వ డివిజన్ శాంతినగర్ ప్రాంతాల్లో మొత్తం రూ.3 కోట్ల విలువైన రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించి నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. 25వ డివిజన్ కొత్త కాలనీలో రూ. 1.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొత్త కాలనీలోని మొత్తం 12 లైన్ల అభివృద్ధి పనులను ప్రణాళికలో చేర్చగా, ప్రస్తుతం 1 నుంచి 7వ లైన్ల వరకు పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. మిగిలిన పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని, త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. 25వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ. 15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తిచేశామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిదంగా జమీందార్ చెరువు పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, వరదల సమయంలో ఇళ్లలోకి నీరు చేరకుండా రూ. 30 లక్షల వ్యయంతో బాక్స్ కల్వర్టునిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అమృత్ పథకం కింద మరో రూ. 1 కోటి నిధులు మంజూరు చేయించామని, జమీందార్ చెరువును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చెరువు బండ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. 24వ డివిజన్ శాంతినగర్‌లో రూ. 1.70 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, డ్రైనేజీ, వర్షపు నీటి నిల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా 3వ, 4వ, 5వ లైన్లలో ప్రతి వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక పరిస్థితులను స్వయంగా పరిశీలించిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యతఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం లోతట్టుగా మారిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ పనులు పూర్తయిన తర్వాత వర్షపు నీటి నిల్వలు, మురుగు సమస్యలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. 24వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ. 7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరయ్యాయని, ఇటీవల స్థానిక వాకింగ్ ట్రాక్‌లో కూడా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తుమ్మల నాగేశ్వరరావు, గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, మాను కొండ శివ ప్రసాద్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివిఐటి విశ్వవిద్యాలయం విద్యార్థులు అధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'







**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 80వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిఐటి విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యంత ఘనంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్ ప్రాంగణం నుండి నంబూరు గ్రామం వరకు 80 మీటర్ల పొడవైన భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు చేపట్టిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మహా ర్యాలీని వివిఐటి ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పొడవునా విద్యార్థులు చేసిన "భారత్ మాతాకీ జై" నినాదాలతో నంబూరు గ్రామం మారుమోగింది. మరొకవైపు, విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో "వివా", వివిఐటి ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు భారతదేశ పటం ఆకారంలో అత్యంత సృజనాత్మకంగా ప్రదర్శనఇచ్చారు. విద్యార్థులలో దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా వివిఐటియు ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.



# ఐక్యతే భారతదేశ ప్రతీక : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కులమతాలకు అతీతంగా భారతావని బానిస సంకెళ్లు తెంచేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఐక్యంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంజుమన్ ఏ ఇస్లామియా ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ విద్యార్థులతో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ తో కలిసి విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి వందేమాతరం నినాదాలు చేశారు. అంజుమన్ పాఠశాల నుంచి హిమనీ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, మతము ఏదైనా, భాష ఏదైనా మనందరి గుర్తింపు ఒకటే భారతీయులమని తెలిపారు. విద్యార్థులు చిన్నవయసు నుంచే శాంతి, ఐక్యతల బాటలో కలసి సాగాలని సూచించారు. స్వేచ్ఛ అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదని, అది దేశ అభివృద్ధి పట్ల మనకున్న బాధ్యత అని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు తమ వంతు పోరాం చేశారన్నారు. దేశ ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన దేశ భక్తులకు స్ఫూర్తిగా తన్నైకోవాలని సూచించారు. మన ఇళ్లపై మువ్వన్నెల జెండా రెపరెపలాడుతుంటే, ప్రతి భారతీయుడి గుండెల్లో ఒక కొత్త ఉత్సాహం, బాధ్యత, దేశభక్తి కనిపిస్తుందని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, భాష అనే తేడాలు లేకుండా "భిన్నత్వంలో ఏకత్వం" అనే మన భారతీయతత్వానికి ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతో సాధించిన స్వేచ్ఛను దేశ ప్రగతి కోసం ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని సూచించారు. ప్రపంచ దేశాలు భారత దేశ ఐకమత్యాన్ని ఆదర్శంగా తీసుకుంటాయని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విభిన్న జాతులు, విభిన్న మతాలు, విభిన్న భాషలు ఉన్నప్పటికీ అందరిదీ ఒకటే మతమని, అదే భారతీయత అని తెలియజేశారు.



# గుంటూరు నగరపాలక సంస్థలో ఉద్యోగుల బదిలీలు

**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జీఎంసీ పరిపాలనా అవసరాల దృష్ట్యా 12 మంది ఉద్యోగులకు బదిలీలు, పోస్టింగ్లు, ఇన్ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ కె. మయూర్ అశోక్ తక్షణం అమలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఏడుగురిని వివిధ విభాగాలకు బదిలీ చేయగా, మరో ఐదుగురికి కొత్త పోస్టింగ్లు, ఇన్ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. సి -సెక్షన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ, ఎడ్యుకేషన్, ఎలక్షన్ తదితర విభాగాల్లో ఈ మార్పులు చేశారు.

# ఏఎన్‌యూ లో ఉచిత మొబైల్ రిపేరింగ్ శిక్షణల ముగింపు




**గుంటూరు, 14 ఆగస్ట్ 14.2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సి ఎస్ ఆర్ , ఎక్స్ ఎల్ ఆర్ ఆధ్వర్యంలో రూసా సహకారంతో నిర్వహించిన 5 రోజుల ఉచిత మొబైల్ రిపేరింగ్ శిక్షణ ముగిసింది. ప్రతి ఒక్కరూ మొబైల్ రిపేరింగ్పై ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉండాలని వీసీ గంగాధర్ అన్నారు. సి ఎస్ ఆర్ సామాజిక సేవా కార్యక్రమాలను పాలకమండలి సభ్యుడు వేణుగోపాల్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉపయుక్తమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎల్ఆర్ కో ఫౌండర్ శ్రీనివాస్ రెడ్డి, సి ఎస్ ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్.ఎం. వెంకటరమణ, మొబైల్ రిపేరింగ్ శిక్షకులు మాధవ్, సిఎస్ఆర్ సిబ్బంది వీరాంజనేయులు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్యవర్గంలో

## గుంటూరుకు సముచిత స్థానం



**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ శుక్రవారం రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై సమర్ధ వంతమైన పోరాటం, రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులను నియమించారు. ఈ రాష్ట్ర కార్యవర్గంలో గుంటూరుకు చెందిన బిజెపి సీనియర్ నాయకులు జూ పూడి రంగరాజు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి సీనియర్ నాయకులు పాలపాటి రవికుమార్ లను నియమిం చారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ, జాతీయ స్పైసెస్ డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, పలువురు బిజెపి నాయకులు వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వామి నగర్ లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**కాకినాడ బ్యూరో, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల సమగ్ర అభివృద్ధిలో భాగంగా 42వ డివిజన్ చిన్న స్వామి నగర్ నందు ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ౘ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిధులు రూ. 50 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్లలో భాగంగా శుక్రవారం సీసీ రోడ్డుకు కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ కూటమి ముఖ్య నాయకులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలోని ప్రజలకు సౌకర్యవంతమైన, నాణ్యమైన రోడ్లు మరియు డ్రైనేజీలను నిర్మించి అందుబాటులోకి తేవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ పేరబత్తుల చంద్ర శేఖరం, కాకినాడ రూరల్ టీడీపీ ఇంచార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, చిక్కాల రామచంద్ర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, ఎల్దూటి మున్నా, యలమంచిలి భాస్కర్, కనపర్తి చిన్న, కొండ వినాయక్, మట్టా రాము, యలగ లోవరాజు, రామకృష్ణ కూటమి శ్రేణులు, వీర మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యూ కి వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ సభ్యత్వం



**గుంటూరు, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ (డబ్ల్యుపిఈఏ) సభ్యత్వం లభించింది. సంబంధిత ధ్రువపత్రాన్ని కార్యనిర్వాహక సంచాలకులు పి.పి.ఎస్ బాల కుమార్, ఏఎన్‌యూ ఉపకులపతి గంగాధరరావుకు అంద జేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడలు, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ సహకారానికి డబ్ల్యుపిఈఏ వేదికగా పనిచే స్తుంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు, సిలబస్ రూపకల్పనలో ఏఎన్‌యూ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ సభ్యత్వం లభిం చిందని వీసీ గంగాధరరావు తెలియజేశారు.

## భూముల బదలాయింపు ప్రక్రియను నిలిపివేయాలి




**అనకాపల్లి జిల్లా బ్యూరో, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం కాగిత గ్రామంలో భూముల బదలాయింపు ప్రక్రియకు సంబంధించి రైతుల అంగీకారం లేకుండా ఎలాంటి తీర్మానాలు చేయవద్దని గ్రామ స్తులు కోరారు. ఈ మేరకు గ్రామస్తులు సంబంధిత అధికారుల కు వినతిపత్రం సమర్పించారు. నక్కపల్లి మండల తహ శీల్దార్ కార్యాలయం నుంచి లెటర్ నం. 221/2026, తేదీ 26-07-2026తో జారీ చేసిన నోటీసును కాగిత గ్రామ సచివాలయం లో 10-08-2026న ప్రదర్శించినట్లు గ్రామ స్తులు తెలిపారు. నోటీసులో పేర్కొన్న భూములకు సంబంధం చిన బదలాయింపు ప్రక్రియపై తమకు అభ్యంతరాలు ఉన్నా యని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన భూముల విష యంలో వారి అంగీ కారం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసు కోవద్దని, గ్రామసభ నిర్వహించి రైతులు మరియు గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేప ట్టాలని వారు కోరారు. అలాగే ఈ అంశంపై గ్రామపంచాయతీ నుంచి తమ కు తెలియకుండా ఎలాంటి తీర్మానాన్ని సంబంధిత ఉన్నతా ధికారులకు పంపించవద్దని విజ్ఞప్తి చేశారు. తమ భూములు, వ్యవసాయానికి సంబంధించిన నీటి వనరులు మరియు ఇతర అంశాలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఈ విష యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొని తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# కాకినాడ జిల్లా పోలీస్ అధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రిహార్సల్స్ నిర్వహించిన జిల్లా పోలీస్ యంత్రాంగం







**కాకినాడ బ్యూరో, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్ నిర్వహించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వ హించారు. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డా.మహంతి కిషోర్ కుమార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ర్యాలీని ప్రారం భించారు. జాతీయ జెండాలను చేతబూని “భారత్ మాతాకీ జై”, “వందేమాతరం” అంటూ దేశభక్తి నినాదాలతో ర్యాలీగా భానుగుడి సెంటర్ వరకు చేరుకుని అక్కడ ర్యాలీని ముగించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ మాట్లాడుతూ వందే మాతరం నినాదం, జాతీయ జెండా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొం దించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి భావనతో బాధ్యతాయుత మైన, ఉత్తమ పౌరులుగా జీవించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యం గా విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్ణయించే గొప్ప వ్యక్తులుగా ఎదిగి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పెద్దలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో బలపడినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డా. మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ఎస్ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏ ఆర్ డిఎస్పీ వి జి శ్రీహరి రావు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, సుమారు 1,500 మంది విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ

### దేశ రక్షణకు సమగ్రతకు కట్టుబడి ముస్లిం సమాజం ఉంది
### ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూఖ్ షుబ్లీ





**కొండపల్లి, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఈ దేశం కోసం.. ధర్మం కోసం.. ప్రాణాలను త్యాగం చేయడానికి ముస్లింలు గతంలోనూ వెనకాడలేదు, ఇప్పుడు వెనకాడం, రాబోయే రోజు ల్లోనూ సిద్ధంగా ఉంటామని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూఖ్ షుబ్లీ స్పష్టం చేశారు. దేశ రక్షణకు, సమగ్రతకు కట్టుబడి ముస్లిం సమాజం ఉందన్నారు. భారతీయ ముస్లింగా ఈ దేశంపై ఏ చిన్న ఆపద వచ్చినా ముందు వరుసలో నిలిచి పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండపల్లిలోని చారిత్రాత్మక హజరత్ సయ్యద్ షా బుకారీ దర్గా ఆవరణలోమైనారిటీ హక్కులపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ.. ‘దేశం కోసం ధర్మం కోసం’ అనే ముఖ్య లక్ష్యంతో సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 65 నియోజ కవర్గాల్లో లక్ష ఇళ్లకు జాతీయ జెండాలను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా మైలవరం నియోజకవర్గ పరిధిలోనే 5వేల ఇళ్లకు జెండాలను అంద జేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింమత పండి తులు, పూర్వీకులు ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంది ముస్లింలు ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. ఆ త్యాగాల బాటలోనే నేటి తరం కూడా దేశ రక్షణకు, సమగ్రతకు కట్టుబడి ఉందన్నారు. భారతీయ ముస్లింగా ఈ దేశంపై ఏ చిన్న ఆపద వచ్చినా ముందు వరుసలో నిలిచి పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనంతరం ?సూఫీ మత గురువు అల్తాఫ్ రజా మాట్లాడుతూ 450 సంవత్సరాల చరిత్ర కలిగిన బుకారీ దర్గా ఆవరణలో ‘ఘర్ ఘర్ తిరంగా’ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమ న్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులు, పెద్దలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెనాలిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పెమ్మసాని




**తెనాలి, 14 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా తెనాలిలోని చెంచుపేట ప్రాం తంలో గల 30 31 వార్డులలో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో కలిసి శుక్రవారం పర్యటించారు. ప్రజలను నేరుగా కలిసి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమం వివరాలను తెలియజేస్తూ, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

**అనంతరం పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ,** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో ఒకవైపు అభి వృద్ధి, మరోవైపు సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. దేశం లో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో లబ్ధిదారులకు రూ. 4 వేల పెన్షన్లను అందిస్తున్నాము. స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు, తదితర సంక్షేమాలను అందరికి ప్రజలకు అందిస్తున్నాము. ప్రజలకు తాగు - సాగునీరుకు ఉప యోగపడే విధంగా హంద్రీనీవా, బనకచర్ల, పోలవరం, గుంటూరు ఛానల్ వంటి ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులను తీసుకువస్తున్నాము. అయినా సరే ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? పథ కాలు అందుతున్నాయా లేదా? వంటి ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ఈ“ఇంటింటికి తెలుగుదేశం” కార్యక్రమం నిర్వ హిస్తున్నాము. శుక్రవారం తెనాలిలో 150 నివాసాలను స్వయంగా పరిశీలించి, వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నాము. కూటమి ప్రభుత్వ పనితీరుపై 90% కు పైగా ప్రజలు సంతృప్తికరమైన అభిప్రాయాలను వెలిగిచ్చుతున్నారని తెలియజేశారు.

**ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మాట్లాడుతూ,** జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై, సంక్షేమం, అభివృద్ధిని అలాగే గత ప్రభుత్వం వైఫల్యాలు, మన ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకం అయ్యేందుకుగానూ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఈరోజు మన తెనాలిలో పర్యటించారు. ప్రజల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఈ కార్యక్రమంలో భాగంగా తెలుసుకుంటు న్నామని తెలియజేశారు.

## BS బ్యూటీ సెలూన్ ప్రారంభం ప్రారంభోత్సవం





**గుంటూరు, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : గుంటూరు గోరంట్ల మెయిన్ రోడ్డు లో ఘనంగా బిఎస్ బ్యూటీ సెలూన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ‘బిఎస్ సెలూన్’ స్పా, హెయిర్ ట్రీట్మెంట్, బ్యూటీ, మేకప్, హెడ్ మసాజ్, డీ- టాన్, హైడ్రో ఫేషియల్, టాటూస్ మొదలగునవి అత్యంత అధునాతన పరికరాలతోటి కస్టమర్ల కు సర్విస్ అందిం చడం జరుగుతుందని నిర్వాహకులు భాష మరియు శ్రీమతి ప్రభావతి తెలియచేశారు. గుంటూరు లోని యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మిత్రులుబంధువులు స్నేహితులు పాల్గొన్నారు.

## ‘వికసిత భారత్’ స్ఫూర్తితో నడింపల్లిలో ఘనంగా సేవా కార్యక్రమాలు

### కుర్చీలు, సిమెంట్ బెంచీల పంపిణీ







**చెరుకుపల్లి, 14 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ‘వికసిత విశ్వభారత్ విజన్ 2047- స్వర్ణాంధ్ర జూ4’ స్ఫూర్తితో మరియు 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నడింపల్లి గ్రామంలో సంస్థ ఫౌండర్ పొదిల చూడామణి సహకారంతో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు చర్లనాగమణి గ్రామ పం చాయతీకి 20 కుర్చీలు, స్థానిక ఆరోగ్య ఉప కేంద్రా నికి 10 కుర్చీలతో పాటు ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం రూ.30 వేల విలువైన నాలుగు సిమెంట్ బెంచీలను సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వాములు కావడం గర్వంగా ఉందని, మునుముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అలాగే శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామంలోని అగ్రహారంలో ఉన్న విజయ ధ్వజం వద్ద శ్రీ మహా సరస్వతి మాతా సేవా సమితి, యాంటీ కరప్షన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా సమితి జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ, గ్రామ నాయకులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

**సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే...**

**ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే**

**నాణ్యతలో రాజీ పడొద్దు... ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి**

**గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో శ్రీధర్ బాబు ఆదేశాలు**

**హైదరాబాద్,ఆగస్టు14 :** 'గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు 2027' కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశర చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రేవంత్‌రెడ్డి భూ కుంభకోణం

**సోదరుడి కంపెనీకి ఐదెకరాలు కేటాయింపు**

**లోకాయుక్తలో బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**హైదరాబాద్,ఆగస్ట్ 14 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ భూ కుంభకోణం పై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ , ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ , ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ , ఎమ్మెల్సీ కోటి రెడ్డి , కార్పొరేషన్ మాజీ చైర్మన్ కృష్ణక్, లీగల్ సెల్ అడ్వకేట్ లలిత రెడ్డి, విశ్వేశ్వర్ , కళ్యాణ్ తదితరులు లోకాయుక్త జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎం తమ్ముడు కొండల్ రెడ్డి 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 200 కోట్ల విలువైన భూములను కేటాయించారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 5 ఎకరాల ప్రజా భూమిని కేవలం రూ. 7 కోట్లకు దారాదత్తం చేశారని విమర్శించారు. ఏరోస్పేస్ కంపెనీ అని చెప్పుకుంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ. లక్ష మాత్రమేనని, టెస్సెరాక్ట్ కంపెనీ అధికారిక బోర్డు నివేదిక ప్రకారం కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా' అని తేలిందని దాసోజు శ్రావణ్ ఆరోపించారు. నివాస ఎ÷-లాట్ అడ్రస్‌తో నడుస్తున్న కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీయడంతో రాత్రికి రాత్రే వెబ్‌సైట్‌లో వివరాలను మార్చేశారని తెలిపారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్ రెడ్డి సీఈవోగా ఉన్నారని లోకాయుక్తకు ఆధారాలు సమర్పించామ ని వెల్లడించారు. మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో అబద్ధాలు చెబితే, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ భూ కేటాయింపులను స్వయంగా ఒప్పుకున్నారని వివరించారు. రికార్డుల్లో కొండల్ రెడ్డి పేరు లేకుండా బినామీలను పెట్టారని ఆరోపించారు. కర్ణాటక 'ముడా' తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ కుంభకోణం సాగిందని దుయ్యబట్టారు. టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే నిలిపివేసి రద్దు చేయాలని , సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ కోసం నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ అధికారులపై అవినీతి నిరోధక చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద విచారణకు బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

**బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ**

**హైదరాబాద్,ఆగస్ట్14 :** తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం

**అదే విషయం చెప్పాను తప్ప ఎవ్వరినీ నొప్పించలే**

**మరోమారు స్పష్టం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్**



**యాదాద్రి,ఆగస్ట్14 :** కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

**పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్,ఆగస్ట్14 :** కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ ఫోటో పెట్టాలి

**అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి.. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్టు14 :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కేంద్రమే అధిక మొత్తంలో బియ్యం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# బోరులో మోటర్ తీస్తుండగా దుర్ఘటన

**విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు మృతి**

**జయశంకర్ భూపాలపల్లి,ఆగస్టు14 :** జిల్లాలోని మల్హార్ మండలం కొయ్యూరులో విషాద ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో తండ్రి, కొడుకు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. కాటారం మండలంలోని మార్వాడిపల్లి గ్రామానికి చెందిన తండ్రి కొట్టేకోళ్ల బాపు(48), కొడుకు మనోజ్(20) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొయ్యూరు శివారులో వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో తమ వ్యవసాయ భూమి వద్ద బోరులోని మోటారు తీసేందుకు తండ్రీకొడుకు వెళ్లారు.అయితే మోటారు తీస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. తండ్రి, కొడుకుల మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబానికి చెందిన ఇద్దరు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డబుల్ ఇళ్లపై ఎందుకీ విమర్శలు

**మాతో వస్తే నిజాలు ఏమిటో చూపిస్తాం**

**సిఎం రేవంత్‌కు మాజీమంత్రి తలసాని సవాల్**

**హైదరాబాద్,ఆగస్ట్14 :** బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిప్పికొట్టారు. దమ్ముంటే తమతో వస్తే తాము కట్టిన ఇండ్లను, ఉంటున్న ప్రజలను చూపిస్తామని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో 69 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. ఢిల్లీలో ఐఏఎస్,ఐపీఎస్ ఆఫీసర్ల క్వార్టర్స్ ఈ విధంగా లేవని నాటి గవర్నర్ డబుల్ బెడ్ రూమ్

ఇళ్లను మెచ్చుకున్నారని తెలిపారు. కొల్లూరులో ఒక్క చోటే 16 వేల ఇండ్లను కట్టామని వెల్లడించారు. నాటి డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను చూపించిన విషయాన్ని చూపించామని వెల్లడించారు. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూమ్ యూనిట్ కాస్ట్ రూ. 9.50 లక్షలు కాగా లబ్దిదారుడికి ఉచితంగా అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇస్తామని అంటున్న ఇందిరమ్మ ఇళ్లకు లబ్దిదారుడు 6 లక్షలు కట్టాలని అంటోందని, అప్లికేషన్ కు మరో 10 వేలు ఇవ్వాలని మేలిక పెట్టారని ఆరోపించారు. ఒక్కో లబ్దిదారుడికి ఎన్ని గజాల్లో నిర్మించి ఇస్తారోనన్న విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్లికేషన్ కు 10 వేల రూపాయలు వసూలు చేసి ఇండ్లను ఇవ్వలేదని విమర్శించారు.పేదవారి భూములను, ఇండ్లను 22 ఏ ద్వారా నిషేదిత జాబితాలో పొందుపరిచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. ఏమి తేలియనట్లు 22 ఏపై మీ భూమి మీకే ఇప్పిస్తా అని సీఎం ప్రకటించడం ఆయన ద్వంద్వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల భూమి ప్రజలకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. 22 ఏలో ఉన్న భూములను ఎత్తివేసేందుకు 30 నుంచి 40 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. బాధ్యత గల సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి క్షుద్ర పూజల గురించి మాట్లాడడం శోచనీయమని అన్నారు.

# మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

**పూలే దంపతుల ఆశయ సాధనలో ప్రజా ప్రభుత్వం**

**దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన**

**రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు**

**ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం**

**విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం**

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,ఆగస్టు14 :** బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు. బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. త ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లు తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లుగా.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

## వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి

## జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



న్యూఢిల్లీ,అగస్ట్14(ఆర్ఎన్ఎ): భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్య దినోత్సవ వేడుకలతో యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

## నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ :** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. 'ఇదంతా పూర్తిగా అనవసరమైన పక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్ల హెచ్చరికలు

## అప్రమత్తం అయిన భద్రతా బలగాలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని రేపటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతోన్న వేళ, ఢిల్లీలో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన ఒక బెదిరింపు ఈ-మెయిల్ భద్రతా దళాలను, పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలోనే దాడులకు పాల్పడతామని ఆగంతకులు ఆ మెయిల్‌లో హెచ్చరించడం సంచలనంగా మారింది. ఆగస్టు 15న ఎర్రకోట లక్ష్యంగా బాంబు పేలుళ్లకు పాల్పడతామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు పోలీసు యూనిఫామ్‌లో ఎర్రకోట ప్రాంగణంలోకి ప్రవేశించి ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని వెల్లడించారు. దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిచ్చే అత్యంత కీలక సమయంలోనే ఈ పేలుళ్లు జరుపుతామని సవాలు విసిరారు. 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక హింసాకాండకు బాధ్యులైన రాజకీయ నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. బెదిరింపు ఈ-మెయిల్ రాగానే ఢిల్లీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, ఇంటెలిజెన్స్ వర్గాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఆగస్టు 15 వేడుకలు జరిగే ఎర్రకోట పరిసర ప్రాంతాలలో భద్రతను అత్యున్నత స్థాయికి పెంచారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, దీని వెనుక ఉన్న ఐపీ అడ్రస్ ఏంటనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పోలీస్ డ్రస్‌లో వస్తారన్న హెచ్చరికల నేపథ్యంలో.. భద్రతా విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులను పునఃపరిశీలించడం, తనిఖీలు చేపట్టడం ప్రారంభించారు.

# భారత్ సహనాన్ని బలహీనతగా భావించవద్దు

## ఆపరేషఫన్ సిందూర్ ఇంటర్వ్యూలో అజితో దోభాల్



**న్యూఢిల్లీ :** భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పరిస్థితులపై అజిత్ డోభాల్ ఈ డాక్యుసిరీస్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ డోభాల్ తెలిపారు. పహల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టా÷-గ్గ్÷ట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్‌తో పంపామని చెప్పారు. 'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్కైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు. డోభాల్‌తో పాటు ఈ ఆపరేషన్ వెనకున్న పలువురు అధికారులు తమ అనుభవాలను ఈ డాక్యుమెంటరీలో వెల్లడించారు. శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీలో, డిస్కవరీ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా భారత్ గతేడాది మే7న ఆపరేషన్ సిందూర్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో పలు ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తరువాత 88 గంటల పాటు ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. మే 10న పాక్ ప్రతిపాదించిన కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది

# రాహుల్ వ్యాఖ్యలపై విదేశాంగశాఖ సీరియస్

## మోడీ విదేశాంగ విధానంపై రాహుల్ ఎద్దేవా

## తీవ్రంగా తప్పు పట్టిన బిజెపి

**న్యూఢిల్లీ :** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిపై రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ అంశంపై విదేశాంగ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేసింది. 'భారత్.. ఇటలీతో బలమైన సంబంధాలు కలిగి ఉందని, దీనిని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. రెండు దేశాల మధ్య స్నేహం, ద్వైపాక్షిక సంబంధాలకు పరస్పర గౌరవం, అవగాహన ముఖ్యమని వెల్లడించింది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ నాయకులను కౌగిలించుకోవడంపై విమర్శలు చేస్తూ, ప్రధాని విదేశాంగ విధాన నిర్వహణను ఎగతాళి చేసినందుకు రాహుల్ గాంధీపై బీజేపీ విరుచుకుపడింది. ఆ కాంగ్రెస్ ఎంపీ 'సంస్కారహీనమైన, అసభ్యకరమైన' భాషను ఉపయోగించారని, ప్రతిపక్ష నాయకుడి పదవి గౌరవాన్ని తగ్గించారని దుయ్యబట్టింది. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, సీనియర్ నేత సందీప్ దీక్షిత్‌ను నకిలీ కౌగిలింత (ఓనీఙ ఊబీఙ)తో పలకరించారు. ప్రధాని మోదీ విదేశీ నాయకులను కౌగిలించుకునే వైఖరిని ఎద్దేవా చేస్తూ రాహుల్ గాంధీ ఈ చర్యలు చేశారు. రాజనీతిని కేవలం ఒక నటనగా మోదీ తగ్గిస్తున్నారని రాహుల్ విమర్శించగా, మధ్యలో సందీప్ దీక్షిత్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ప్రస్తావన తీసుకువచ్చారు. దానికి రాహుల్ కూడా సరదాగా స్పందించడం రాజకీయ దుమారానికి దారితీసింది.



# దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

## పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేపై మోడీ

**న్యూఢిల్లీ :** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

# కరూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు

**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

# జనగణన-2027పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్

## 40 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఆగస్టు14 :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన-2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ పక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ :** భారత్‌లో బంగారం ధరలు నేడు మరోసారి తగ్గాయి. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడంతో నేడు భారత్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.710 మేర తగ్గింది. గురువారం కూడా పసిడి ధర రూ.1,260 మేర తగ్గిన విషయం తెలిసిందే. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 14) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,52,890గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.650ల మేర తగ్గి రూ.1,40,150కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,670 వద్ద కొనసాగుతోంది.

# 600వ టెస్టు ముంగిట టీమిండియా

## చరిత్రలో నిలిచిన 5 అద్భుత విజయాలు

భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతం కానుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా తన 600వ టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ ఘనత సాధించిన మూడో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నాయి. శనివారం (ఆగస్టు 15) నుంచి గాలే వేదికగా శ్రీలంకతో ప్రారంభం కానున్న తొలి టెస్టు, భారత్‌కు ఈ చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ఇది కేవలం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అవకాశాల కోసమే కాకుండా, భారత క్రికెట్ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఈ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కావడం మరో విశేషం. ఈ అరుదైన సందర్భంపై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందిస్తూ, "600వ టెస్టుకు నాయకత్వం వహించడం ఎంతో గౌరవంగా ఉంది. అది కూడా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కావడం మరింత పెద్ద గౌరవం" అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఈ చారిత్రక సందర్భంలో, భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఐదు అద్భుత విజయాలను ఓసారి గుర్తుచేసుకుందాం.



### 1. పోర్ట్ ఆఫ్ స్పెయిన్, 1976 - అసాధారణ ఛేజింగ్

ఆ రోజుల్లో వెస్టిండీస్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం, అందులోనూ 403 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం ఒక కల మాత్రమే. అంతకుముందు 1948లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా మాత్రమే 400 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో గెలుస్తామని సునీల్ గవాస్కర్ కూడా ఊహించలేదు. తన ఆత్మకథ 'సన్నీ డేస్'లో, "ఆ వికెట్‌పై మ్యాచ్‌ను కాపాడుకోగలమని నాకు నమ్మకం ఉంది కానీ, గెలుస్తామనే ఆలోచన నా మనసులోకి అస్సలు రాలేదు" అని రాసుకున్నాడు. కానీ, టీమిండియా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. చివరి రోజు గెలుపునకు 269 పరుగులు అవసరమైన దశలో, 'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్ అద్భుతమైన సెంచరీ (102) సాధించగా, గుండప్ప విశ్వనాథ్ (112) శతకంతో కదం తొక్కాడు. బిషన్ సింగ్ బేడీ నాయకత్వంలోని జట్టు ఆ చారిత్రక లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది. మరుసటి రోజు ట్రినిడాడ్ ఎక్స్‌ప్రెస్ పత్రిక "చరిత్రను ధిక్కరించిన భారత్, వెస్టిండీస్‌పై ఘన విజయం" అనే శీర్షికతో ప్రశంసించింది.

### 2. కోల్‌కతా, 2001 - ఫాలో-ఆన్ మ్యాజిక్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ విజయం చారిత్రకమైతే, 2001లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాపై సాధించిన విజయం టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుతం. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా, భారత్ కేవలం 171 పరుగులకే కుప్పకూలింది. 274 పరుగుల భారీ ఆధిక్యంతో ఫాలో-ఆన్‌లోకి నెట్టబడింది. ఆ దశలో భారత్‌కు అద్భుతం కంటే ఎక్కువే అవసరమైంది. అప్పుడే వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ మధ్య ఒక అపురూప భాగస్వామ్యం మొదలైంది. ఐదో వికెట్‌కు 376 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి, భారత స్కోరును 657/7 వద్ద డిక్లేర్ చేసేలా చేశారు. దీంతో ఒక్కసారిగా ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ సాధించిన హర్భజన్ సింగ్, ఐదో రోజు తన స్పిన్ మాయాజాలంతో ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చేశాడు. ఫలితంగా భారత్ 171 పరుగుల తేడాతో నమ్మశక్యం కాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపు నేటికీ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తుంది.

### 3. అడిలైడ్, 2003 - ద్రవిడ్ వీరోచిత ప్రదర్శన

ఈడెన్ గార్డెన్స్ అద్భుతం జరిగిన రెండేళ్లకు, అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ మరో మరపురాని విజయాన్ని నమోదు చేసింది. రికీ పాంటింగ్ డబుల్ సెంచరీతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోరు సాధించింది. మళ్లీ రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ ద్వయం కోల్‌కతా పోరాటాన్ని గుర్తుచేస్తూ 333 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ద్రవిడ్ (233), లక్ష్మణ్ (148) రాణించడంతో భారత్ 523 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అజిత్ అగార్కర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగాడు. కేవలం 41 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు 196 పరుగులకే ఆలౌటైంది. 230 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తరఫున ద్రవిడ్ మరోసారి నిలబడ్డాడు. ప్రశాంతంగా, అజేయంగా 72 పరుగులు చేసి చివరి రోజు భారత్‌ను 4 వికెట్ల తేడాతో గెలిపించాడు.

### 4. బ్రిస్బేన్, 2021 - చారిత్రక గబ్బా గెలుపు

గాయాలతో సతమతమవుతూ, కీలక ఆటగాళ్లు లేకుండా ఆస్ట్రేలియాలో సాధించిన గబ్బా విజయం భారత టెస్ట్ చరిత్రలో ఒక శిఖరం లాంటిది. విరాట్ కోహ్లీ, జస్‌ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్, మహమ్మద్ షమీ, రవీంద్ర జడేజా, హనుమ విహారి, ఉమేష్ యాదవ్ వంటి కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగిన గాయపడిన జట్టు, పటిష్ఠమైన ఆస్ట్రేలియాను ఎదుర్కొంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 369 పరుగులకు సమాధానంగా, శార్దూల్ ఠాకూర్, అరంగేట్ర ఆటగాడు వాషింగ్టన్ సుందర్ వీరోచిత పోరాటంతో భారత్ 336 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ సిరాజ్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆసీస్ 294 పరుగులకు ఆలౌటైంది. 32 ఏళ్లుగా గబ్బాలో ఓటమన్నదే ఎరుగని ఆస్ట్రేలియాపై భారత్ 328 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. శుభ్‌మన్ గిల్ (91), రిషభ్ పంత్ (89నా), సుందర్ (22) అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆసీస్ బౌలింగ్ దాడిని ఎదుర్కొని చారిత్రక విజయాన్ని అందించారు. ఈ 3 వికెట్ల గెలుపునకు భారత టెస్ట్ చరిత్రలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది.

### 5. లార్డ్స్, 2021 - కోహ్లీ నాయకత్వంలో దూకుడైన విజయం

2021 లార్డ్స్ టెస్టులో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. కేఎల్ రాహుల్ సెంచరీతో భారత్ 364 పరుగులు చేస్తే, జో రూట్ అద్భుత ఇన్నింగ్స్ (180)తో ఇంగ్లండ్ 391 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా లోయర్ ఆర్డర్ పోరాటంతో భారత్ 298/8 వద్ద డిక్లేర్ చేసింది. చివరి రోజు దాదాపు రెండు సెషన్ల ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని అంతా భావించారు. కానీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన జట్టులో స్ఫూర్తి నింపుతూ, "ఈ 60 ఓవర్లలో వాళ్లకు నరకం చూపించాలి" అని పిలుపునిచ్చాడు. ఆ మాటలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మహమ్మద్ సిరాజ్ (4), బుమ్రా (3), ఇషాంత్ శర్మ (2), షమీ (1) వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లండ్ కేవలం 51.5 ఓవర్లలోనే కుప్పకూలింది. దీంతో భారత్ 151 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

భారత టెస్ట్ క్రికెట్ ప్రస్థానంలో ఇలాంటి ఎన్నో మరపురాని విజయాలు ఉన్నాయి. 600వ టెస్టు ఆడుతున్న ఈ తరుణంలో, ఈ చారిత్రక విజయాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

# శ్రీలంకతో టెస్ట్ సిరీస్


## కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే తమ ప్రధాన లక్ష్యమని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. శ్రీలంకతో రేపు శనివారం గాలేలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం. గాలే వేదికగా జరిగే 50వ టెస్టు కూడా ఇదే. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే తొమ్మిది టెస్టుల్లో దాదాపు ఆరు లేదా ఏడు మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయని గిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. కాగా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత జట్టు ముందుగానే అక్కడికి చేరుకుంది. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తో సన్నాహక మ్యాచ్ ఆడింది. ఈ అదనపు సమయం ఆటగాళ్లకు పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడిందని గిల్ చెప్పాడు. బుమ్రా లేకపోయినా భారత ఫాస్ట్ బౌలింగ్‌పై గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించాడు. గుర్నూర్ బ్రార్ కూడా పాత బంతితో మంచి బౌన్స్ రాబట్టగలడని పేర్కొన్నాడు. శ్రీలంకలో పిచ్ ల నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని.. అలాంటి పరిస్థితుల్లో విభిన్న వ్యూహాలతో ఒత్తిడి పెంచాల్సి ఉంటుందని చెప్పాడు. దేవదత్ పడిక్కల్‌పై కూడా గిల్ ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇండియా-ఏ తరఫున శ్రీలంకలో ఆడిన అనుభవం అతడికి ఉపయోగపడుతుందని తెలిపాడు. గాలే లాంటి ఓపెన్ మైదానాల్లో గాలి దిశ బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుందని వివరించాడు.

# బీసీసీఐలో భారీ మార్పులు..

## డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వీవీఎస్ లక్ష్మణ్?



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలనా వ్యవస్థలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (సీవోఈ) అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్‌కు పదోన్నతి లభించనుంది. అతడిని 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' అనే కొత్త, శక్తిమంతమైన పదవిలో నియమించేందుకు బోర్డు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం లక్ష్మణ్ సీవోఈ (గతంలో జాతీయ క్రికెట్ అకాడమీ) హెడ్‌గా ఆటగాళ్ల పునరావాసం, శిక్షణ వంటి బాధ్యతలు చూస్తున్నాడు. 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమితులైతే, ఆయన పరిధి మరింత విస్తృతం కానుంది. సీనియర్ పురుషుల, మహిళల జట్ల వ్యూహరచన, జాతీయ సెలక్షన్ కమిటీతో సమన్వయం, జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయి వరకు ఆటగాళ్ల ప్రగతిని పర్యవేక్షించడం వంటి కీలక అధికారాలు ఆయన చేతికి వస్తాయి. ఇదే సమయంలో, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం కూడా సెప్టెంబర్‌తో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని 2027 జూన్ వరకు పొడిగించాలా? లేక కొత్త వారిని నియమించాలా? అనే అంశంపై కూడా బీసీసీఐ చర్చిస్తోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంతో సమన్వయం కోసం లక్ష్మణ్ లాంటి అనుభవజ్ఞుడి సేవలు అవసరమని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. గతంలో రాహుల్ ద్రవిడ్ తర్వాత టీమిండియా హెడ్ కోచ్ పదవిని చేపట్టాలని బీసీసీఐ కోరినప్పటికీ, లక్ష్మణ్ సున్నితంగా తిరస్కరించాడు. బెంగళూరులోని నూతన సీవోఈ ప్రాజెక్టుపై దృష్టి సారించేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గాడిన పడటంతో, ఆయన అనుభవాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించుకునేందుకు బీసీసీఐ సిద్ధమైంది.

# ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర.. టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లా బ్యాటర్‌గా తన్జీద్!

ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. యువ ఓపెనర్ తన్జీద్ హసన్ తమీమ్ చారిత్రక సెంచరీతో అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు అద్భుతమైన శతకం బాదిన తన్జీద్.. కంగారూల గడ్డపై టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను ఆడుతున్న రెండో టెస్టులోనే ఈ 25 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో 23 ఏళ్ల నాటి రికార్డును తన్జీద్ బద్దలు కొట్టాడు. 2003లో మాజీ ఓపెనర్ హన్నన్ సర్కార్ చేసిన 76 పరుగులే ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఒక బంగ్లా బ్యాటర్ చేసిన అత్యధిక స్కోరు. దానిని అధిగమిస్తూ తన్జీద్ 190 బంతుల్లో 101 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 బౌండరీలు, ఒక భారీ సిక్సర్ ఉన్నాయి. అంతకుముందు తొలి రోజు బంగ్లా పేసర్ హసన్ మహమూద్ (6/55) అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియాను కేవలం 198 పరుగులకే ఆలౌట్ చేసిన సంగతి తెలిసిందే. దీనికి సమాధానంగా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌కు తన్జీద్ వెన్నెముకగా నిలిచాడు. కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్‌లతో కూడిన ప్రపంచ



స్థాయి ఆస్ట్రేలియా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండో ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో జీరో పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి బతికిపోయిన తన్జీద్, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మొమినుల్ హక్ (49)తో కలిసి రెండో వికెట్‌కు 102 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 188 బంతుల్లో తన తొలి టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత నాథన్ లియాన్ బౌలింగ్‌లోనే లాంగ్-ఆఫ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. "ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఇది నాకు చాలా ప్రత్యేకం. నేను ప్రశాంతంగా ఉంటూ, సాధారణ క్రికెట్ షాట్లు ఆడేందుకు ప్రయత్నించాను" అని తన్జీద్ తెలిపాడు. మొత్తం మీద తన్జీద్ చారిత్రక ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఈ టెస్టులో పట్టు బిగించింది. ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయం సాధించే దిశగా ఆ జట్టు అడుగులు వేస్తోంది.



## ఓ కుటుంబ కథా చిత్రమ్...
# విశ్వనాథ్ అండ్ సన్స్




కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా? సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది

**నటుడు యశ్ ప్రశంసలు**

సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు.



# నన్ను ఆమెతో పోల్చడం బాధ్యతను పెంచింది

కంటెంట్ ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి కామాక్షి భాస్కర్ల. 'పొలిమేర' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఆమె, తాజాగా 'అగధ' అనే మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన ఈ చిత్రం రేపు (ఆగస్ట్ 14) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కామాక్షి మీడియాతో ముచ్చటించి సినిమా విశేషాలను, తన వ్యక్తిగత ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ సినిమాలోని 'మహాదేవి' పాత్ర కోసం తాను బౌద్ధ మతానికి సంబంధించిన పుస్తకాలు చదవడమే కాకుండా, బ్లాక్ మ్యాజిక్ గురించి కూడా తెలుసుకున్నానని ఆమె చెప్పిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. మహాదేవి పాత్ర కోసం సిద్ధమవ్వడం ఒక పెద్ద సవాల్ అని కామాక్షి తెలిపారు. "ఆ పాత్ర కోసం నేను కామాక్షిని పూర్తిగా పక్కన పెట్టాల్సి వచ్చింది. నా సొంత వ్యక్తిత్వాన్ని, సిద్ధాంతాలను వదిలి ఆ పాత్రలోకి మారడానికి కాస్త ఇబ్బంది పడ్డాను. ప్రతి ముద్ర, ఆ పాత్ర నడవడిక గురించి లోతుగా అర్థం చేసుకుని నటించాను. సినిమాలో ఎక్కడా కామాక్షి కనిపించకూడదని జాగ్రత్త పడ్డాను" అని ఆమె వివరించారు. తన అభిమాన దర్శకుడు ఎం.ఎస్. రాజు నుంచి ఫోన్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, ఆయన తీసిన 'మనసంతా నువ్వే' తన ఆల్ టైం ఫేవరేట్ అని తెలిపారు.సీనియర్ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి తనను అనుష్కతో పోల్చడంపై స్పందిస్తూ, "అంత పెద్ద నిర్మాత అలా అనడం ఆనందంగా ఉంది. ఆయన అనుష్క గారితో పోల్చడం నా బాధ్యతను మరింత పెంచింది" అని నవ్వుతూ చెప్పారు. తన తొమ్మిదేళ్ల సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ కామాక్షి భావోద్వేగానికి గురయ్యారు. "మగవాళ్లు చేస్తే మేల్ సెంట్రిక్ అనరు, కానీ మహిళలు చేస్తే ఫిమేల్ సెంట్రిక్ అంటారు. నేను సినిమాల కోసం ఎంతో కష్టపడ్డాను. ఇప్పటికీ నాకు కారు లేదు, బైక్ మీదే వస్తాను. ప్రొడక్షన్ వాళ్లు ఇచ్చే వాహనం కూడా నాకు కొత్తగా అనిపిస్తుంది. మాది మధ్యతరగతి కుటుంబం కావడంతో కారు మాకు పెద్ద విషయం" అని ఆమె తన సాధారణ జీవనశైలి గురించి పంచుకున్నారు.



# నా మాటలను వక్రీకరించారు : అనసూయ భరద్వాజ్

హిందూ ధర్మం, సనాతన ధర్మంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగడంతో... సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన మాటలను కొందరు కావాలనే వక్రీకరించి ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఏ మతాన్ని కించపరచనని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని అనసూయ స్పష్టం చేసింది. తాను సనాతన ధర్మాన్ని పాటించే పక్కా హిందువునని, తన ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల తనకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొంది. తాను చెప్పిన అసలు విషయాన్ని పక్కన పెట్టి, సనాతన ధర్మాన్ని అవమానించినట్లు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికింది. అసలు ఏం జరిగిందంటే... గతంలో ఒక సందర్భంలో అనసూయ మాట్లాడుతూ.. 'జై శ్రీరామ్' అనే నినాదం ముసుగులో కొందరు దాడులకు తెగబడుతున్నారని, కేవలం నినాదాలు చేయడం కంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమని వ్యాఖ్యానించడమే ఈ వివాదానికి కారణమైంది. సనాతన ధర్మం పేరుతో దాడులు చేయడాన్ని ప్రశ్నించిన ఆమె, తాను శ్రీరాముడినే కొలుస్తానని, ఆ భక్తితోనే తన పెద్ద కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని వివరించింది. ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవడంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమె తాజాగా ఈ వివరణ ఇచ్చింది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342